
ఎట్టకేలకు, ఎన్నో ఏళ్లకు నాకు ప్రమోషనొచ్చింది



# రిజిష్టర్డ్ పోస్ట్

ఆర్.కె. వటారి

'జన్మకో శివరాత్రి' అనే లోకోక్తి మా డిపార్ట్‌మెంట్‌కి బాగా వర్తిస్తుంది. మాకు 'సర్వీసుకో ప్రమోషన్' మాత్రమే.

నా సన్నిహిత మిత్రులు శ్రీధర్, ఆంజనేయులు, సుబ్బయ్య పార్టీ కావాలని పట్టుబట్టారు. పోనీలే, సర్వీసులో మరో ప్రమోషన్ వచ్చేనో-చచ్చేనో అని ఒప్పుకున్నాను.

పార్టీ అంటే – తారతమ్యం లేకుండా ప్రస్తుతం చెలామణిలో వున్న గొర్రెదాటు ఫ్యాషన్ ప్రకారం – మందు కొట్టించమని మిత్రులెంత గింజుకున్నా, ఆ వాసనే నాకు గిట్టదు గనుక మా యింట్లోనే చక్కటి విందు ఏర్పాటు చేశాను.

మిత్రులు తృప్తిగా భోంచేశారు.

వెన్నెలరాత్రి, ఆహ్లాదకరంగా వుంది. కొంతసేపు ఆ చల్లదనాన్ని అనుభవిద్దామని ఇంటి ముందు ఖాళీస్థలంలో కుర్చీలు వేసుక్కూర్చొని కబుర్లలో పడ్డాం.

శాఖా చంక్రమణం చేసి చర్చ 'మానవాతీత శక్తి' మీదకి మళ్ళింది.

ఆస్తికుడైన ఆంజనేయులు స్వానుభవం లోంచి ఏదో ఉదంతాన్ని ఉటంకిస్తూ, మన జీవిత గమనాలలో మన ప్రమేయం ఏమీలేదని, ఏదో మానవాతీత శక్తి ప్రభావం వల్లనే ఎప్పుడేం జరగాలో అలా జరుగుతుందని, ఆ శక్తి చేతిలో మనం తోలుబొమ్మలమని తన అభిప్రాయం చెప్పాడు.

నాస్తికుడైన శ్రీధర్ అతనితో ఏకీభవించలేదు. అలా అనుకోటం మూర్ఖత్వమని, మన శక్తి సామర్థ్యాలే మన జీవితాల్ని తీర్చిదిద్దుతాయని వాదించాడు.

సుబ్బయ్య, నేను వాళ్ళిద్దరిలో ఏ కోవకీ చెందం. మేము జిజ్ఞాసువులం. వాళ్ళిద్దరివలె యీ సరికే నిశ్చితాభిప్రాయాలు ఏర్పరుచుకొని జీవితాంతం ఆ నమ్మకాల ప్రవాహంలో కొట్టుకుపోటం మా కిష్టంలేదు. ఎందుచేతనంటే యీ జీవిత గ్రంథంలో అనుభవ పాఠాలు ఎన్నెన్నో! వాటిని చదివి అర్థం చేసుకోటానికి యీ జీవితమే చాలకపోవచ్చు! సత్యావిష్కరణ అంత సులభం కాదు! అనాది నుంచీ ఎందరో మహానుభావులకే సాధ్యం కాని విషయమిది! మా బోంట్లకు సాధ్యమయ్యే పనా!

నాస్తికత్వానికి పునాది హేతువాదం. హేతువాద దృష్టి లేకపోతే జీవితంలో పురోగతి వుండదు. మూఢనమ్మకాలకు ఆలవాలమై పోతుంది జీవితం. కాని ప్రపంచంలో ఎందరో మహా మేధావులు, తాత్వికులు దైవచింతన కలిగినవారే! మరి యీ హేతువాద దృష్టి వారికి లేదా? ఉంటే దైవాన్ని ఎలా విశ్వసించారు? ఏది సత్యం—ఏదసత్యం?

"ఆంజనేయులు చెప్పింది కొంతవరకు నిజమేనేమో! మతపరమైన విశ్వాసాలకి సాక్ష్యాలు చూపించటం కష్టం కావచ్చుగాని శాస్త్రాన్ని కాదనలేము గదా! ఖగోళశాస్త్రం ప్రకారం యీ భూమండలంలోని సమస్త ప్రాణికోటిపైన చంద్రుని ప్రభావం వుంటుందట! అలాగే సూర్యగోళంలో ప్రతి పదకొండు సంవత్సరాల కొకసారి ఏర్పడే మచ్చలకీ, ప్రపంచ రాజకీయ పరిస్థితులకీ అవినాభావ సంబంధ మున్నదంటారు. రెండు ప్రపంచ యుద్ధాలు జరిగిందీ సూర్యుడిలో యీ మచ్చలు గరిష్ఠ స్థాయిలో వున్నపుడేనట!... రాజకీయ పరిస్థితులలో మార్పులు గాని, యుద్ధాలు జరిగేది కాని దేశాధినేతలు తీసుకొనే 'నిర్ణయాల' వల్లనే! మరటువంటప్పుడు ఆ నిర్ణయాలు వాళ్ళ ప్రమేయం లేకుండా జరిగినట్టే గదా?"

సుబ్బయ్య సైన్సు స్టూడెంటు. తన శాస్త్రీయ దృక్పథంలో తార్కికంగా సమర్థించాడు.

శ్రీధర్ ఆ తర్కాన్ని ఖండించాడు.

"మూఢనమ్మకాలకి, ప్రకృతి సిద్ధమైన మార్పులకి ముడి పెడితే లాభంలేదు. ఈ మహావిశ్వంలో పరస్పర గురుత్వాకర్షణ శక్తి వల్లనే గ్రహాలు తిరుగుతున్నయ్-కాబట్టి ఒక గ్రహంలో చెలరేగే మార్పుల ప్రభావం మరో గ్రహంపై వుండవచ్చు. అయితే అది భౌతికంగానే! మానవ జీవితాలపై, వారి

కోళ్ళ వ్యాధులు
(ప్రథమ ముద్రణ) వెల రూ.12/-



Dr. R. శ్రీనివాసరావు B.V.Sc   Dr. P. శ్రీరాములు M.V.Sc

- వైరస్, బాక్టీరియా, ఫంగస్, కొన్ని ఇతర వ్యాధుల చికిత్స
- వ్యాధి నివారణ, తీసుకోవలసిన జాగ్రత్తలు
- కోళ్ళ షెడ్లు, లిట్టరు, మందులు వాడకం కొన్ని ముఖ్య విషయాలు
- వ్యాధి నిరోధక టీకాలు - వేసే పద్ధతి

కోళ్ళ పరిశ్రమ



మూడవ ముద్రణ వెల రూ.15/-

Dr. G. సుబ్బారావు B.V.Sc

- కోళ్ళ పెంపకం - కొన్ని ముఖ్య విషయాలు
- కోళ్ళ దాణా - సాధారణ కోళ్ళ వ్యాధులు జాగ్రత్తలు
- ప్రభుత్వ ఉపాధి కల్పన పథకాలు బ్యాంకు ఋణ సౌకర్యాలు
- కోళ్ళ పెంపకంలో ఆదాయ - వ్యయ పట్టికలు

కుక్కలు - సంరక్షణ పెంపకం
ప్రథమ ముద్రణ వెల రూ.8/-



Dr. R. శ్రీనివాసరావు B.V.Sc

- కుక్కల ఆవిర్భావము - రకములు - కొన్ని ఫోటోలు
- కుక్క పిల్లను ఎంచుకొనుట - వాటి ప్రవర్తన - ట్రైనింగ్
- చూడి కుక్కలు - పెద్ద వయస్సు కుక్కల పోషణ
- కుక్కల ఆహారం - ఆరోగ్యం

పుస్తకం ఖరీదు ముందుగా M.O చేసిన వారికి పోస్టు ఖర్చులతో V.P.P ద్వారా పంపుతాం

నవ్యసాహిత్య బుక్ సెంటర్
ఏలూరు రోడ్డు, విజయవాడ-2. ఫోన్ 62222


# రిజిష్టర్డ్ పోస్టు

మనసులపై ఆ ప్రభావం వుంటుందనటం కేవలం అవకాశ వాదం!''

"నీది మతిలేని వాదం! కాకపోతే సైన్స్ అవకాశవాదమెలా అవుతుంది? సైన్సునే ఒప్పుకోని వాడివి నువ్వేం నాస్తికుడివి?''

"ప్చ్-ప్చ్ ప్చ్!'' చర్చ వేడెక్కుతున్నదని బిగ్గరగా అన్నాను.

"అబ్బాయిలూ, ఆగండి! మీ ఖగోళ చర్చతో ప్రశాంతంగా వున్న మా బుర్రలెందుకు పాడుచేస్తారు గాని, ఆంజనేయులు అభిప్రాయాల్ని బలపరిచే సంఘటనలు కొన్ని నా జీవితంలోనూ జరిగాయి. వాటిని చెప్తాను వినండి తర్వాత శ్రీధర్ ఏం చెప్పగలడో చూద్దాం!''

ముగ్గురూ నా కథనం వినడానికి సంసిద్ధులయ్యారు.

* * *

"నేను ఉద్యోగంలో చేరిన రోజుల్లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు ప్రతిఏడూ జరుగుతుండేవి. నాకు ఇంటర్మీడియట్‌లో పార్టు పోయింది ఆపార్టు పూర్తిచేసుకుంటూ ఎవరి సలహా మీదనో ప. స. క. పరీక్షలకి కూడ కూర్చున్నాను...''

"అవేం పరీక్షలోయ్? నేనెక్కడా వినేదే!'' సుబ్బయ్య అడు పడ్డాడు సిగరెట్ అందుకుంటూ

"ఒరే మందమతీ, ఇప్పుడేగదరా చెప్పాను పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలని! అంత శ్రద్ధగా వింటున్నావన్నమాట?''

"శ్రద్ధగానే వింటున్నాన్లే కానియ్'' సిగరెట్ వెలిగించుకుంటూ అన్నాడు.

"తర్వాత నేను పార్టులో పాసయ్యాను! మా కాలేజి స్థాపించి అప్పటికి రెండేళ్ళు అయింది. డిగ్రీ తరగతులు యింకా ప్రవేశ పెట్టలేదు. కావలి కాలేజి 'జవహర్ భారతి'లో చేరటానికి సన్నద్ధమవుతున్నాను. మా నాన్న అందుకు కావలసిన డబ్బు సేకరణలో తంటాలు పడుతున్నాడు.

అప్పుడే వచ్చింది సర్వీస్ కమిషన్ వాళ్ళ సెలెక్షన్ ఆర్డరు! అందులో మరోపది రోజుల్లో 'ఫిజికల్ ఫిట్నెస్ సర్టిఫికెట్' పంపకపోతే సెలెక్షన్ రద్దవుతుందని వుంది!

అప్పుడు నేను పడ్డ ఆవేదన మీకు మాటల్లో చెప్పలేనిది. ఉరకలు వేస్తూ నా గమ్యహర్మ్యం మెట్లెక్కుతుంటే ఎవరో వెనక నుంచి నా మీదికి ఉచ్చు విసిరి బలవంతంగా కిందికి లాగుతున్నట్టు వ్యథ!

ఈ ఆర్డరు యిప్పుడే రావాలా! ఏదో సరదాకి కూర్చున్నానేగాని ఈ పరీక్షలు ఇలా నా భవిష్యత్తుకే పరీక్ష పెడతాయనుకోలేదు. కాలేజిలో చేరిన తర్వాత వస్తే ఖాతరు చేసి వుండేవాణ్ణి కాదు కాని యిప్పుడు పెద్దల వత్తిడి ఎక్కువైంది.

'మహా అయితే బి. ఏ. చదువుతావు. బి. ఏ. చదివినా గుమాస్తా ఉద్యోగమేగా వచ్చేది! నువ్వు ఎంతో అదృష్టవంతుడివి కాబట్టి యింత చిన్న వయసులోనే గవర్నమెంటు ఉద్యోగం వచ్చింది. ఎంతో పైకి పోవచ్చు. కడుపులో చల్ల కదలకుండా బతగొచ్చు. కాళ్ళదగ్గర కొచ్చిన అదృష్టాన్ని కాలదన్నుకుంటారా ఎవరైనా!' అంటూ హితబోధ చేశారు.

'కూపస్థమండూకం' ఆలోచనలని కసిగా తిట్టుకున్నాను. నా బంగారు భవిష్యత్తు మట్టిపాలైందని, ఎవరో నా కన్యాయం చేస్తున్నారని, ఎవరికీ చెప్పుకోలేక, ఏమీ చెయ్యలేక, దుఃఖాన్ని ఆపుకోలేక, ఆ రాత్రి మా వీధి అరుగుమీద చీకట్లో ఒక్కణ్ణే కూర్చొని, మోకాళ మధ్య తల పెట్టుకొని మౌనంగా రోదిస్తున్నాను.

కాస్సేపటికి నా తలని ఎవరిదో హస్తం ప్రేమతో నిమిరింది. స్పర్శలోనే అంత ప్రేమని తెలిపేది యింకెవరిదై వుంటుంది— మా నాన్నదే!

'బాబూ!' అన్నాడు ఆర్ద్రంగా.

కళ్ళు తుడుచుకుంటూ తల పైకెత్తాను.

'చూడయ్యా! నీ బాధ నాకు తెలియదా? ఇంత చిన్నవయసులోనే నీ రెక్కల కష్టాని కాశపడతానా? కాని ... ఇల్లు గడవటమే ఎంతో కష్టంగా వున్న యీ పరిస్థితుల్లో నిన్ను నేను చదివించ గలనా? ఉద్యోగం రాకపోతే ఆ దారి వేరు. కష్టమో నిష్ఠూరమో శక్తి వున్నంతవరకు చదువుకోక చేసేదేంలేదు. కాని, నీకెందుకా బుద్ధి పుట్టిందో ఆ పరీక్షలకి కూర్చున్నావు, కూర్చున్న వాళ్లందరికీ ఉద్యోగాలొస్తున్నాయా! ఇది మన మంచికే వచ్చిందని ఎందు కనుకోగూడదు? కాలేజిలో చదవకపోతే మాత్రమేం! ఇంకా నీది చిన్న వయసే. నీకంత మనసుంటే ప్రైవేటుగా చదువుకోవచ్చు ఇది చేస్తూనే యింకేదైనా

మంచి ఉద్యోగానికి ప్రయత్నం చేసుకోవచ్చు! మన కుటుంబం యిక ముందు బతికి బట్ట కట్టటానికి యీ ఉద్యోగం దేవుడిచ్చిన వరం బాబూ!'

అంతే! నేను ఉద్యోగంలో చేరిపోయాను

ఓ సంవత్సరం గడిచిపోయింది. నేను ప్రైవేటుగా స్టడీస్ కొనసాగించే ప్రయత్నమైతే చెయ్యలేదుగాని, రైల్వే సర్వీస్ కమిషన్ వాళ్ళు ప్రకటనపడితే దానికి అప్లై చేశాను. రిటెన్ టెస్ట్‌కి సికింద్రాబాద్ వెళ్ళొచ్చాను

మా కజిన్ బదరు అప్పటికే సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ సూపరింటెండెంట్ ఆఫీసులో క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. వాళ్ళ ఆఫీసు చూసొచ్చాను. సెలెక్ట్ అయితే పోస్టింగ్ అక్కడే వస్తుందట. ఆ విషయం నాకెంతో సంతోషం కలిగించింది. అప్పుడు నేను చేరిన సింగిల్ క్లర్కుండే చోటా ఆఫీసులాకాక, అక్కడ వందలమంది స్టాఫు, మంచి సౌకర్యాలు, సిటీలైఫ్ నన్నెంతో ఆకర్షించాయి. అక్కడ ఉద్యోగం రావటం అదృష్టమే ననుకున్నాను.

కొద్ది కాలం గడిచింది.

ఒకరోజు పోస్ట్‌మన్ ఒక రిజిస్టర్డ్ కవరు పట్టుకొచ్చి 'యిదెవరిదో చూడండి' అన్నాడు.

కవరు బరువుగా వుంది. దానిమీద నా పేరే వుంది! సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ సూపరింటెండెంట్ ఆఫీసునుంచొచ్చింది.

ఎగిరి గంతేసినంత సంతోషంతో 'ఇది నాదే!' అన్నాను.

'మీది కాదు, ఇంటిపేరు చూడండి' అన్నాడు పోస్ట్‌మేన్.

అంతవరకు దృష్టంతా పేరుమీదేగాని, యింటిపేరు మీదికి పోలేదు. 'క' కారంలోనే చిన్న పొరపాటు జరిగి వేరే ఇంటిపేరు వచ్చింది.

'ఇంటిపేరు పొరపాటు పడినట్టుంది. ఇది నాదే! యివ్వు' అన్నాను.

ఇంటిపేరు మారింది కాబట్టి యివ్వటానికి వీల్లేదన్నాడు.

'ఈ పేటలో నేను తప్ప యింకెవ్వరూ రైల్వే సర్వీస్ కమిషన్ పరీక్షలకి పోలేదయ్యా బాబూ! ఇది తప్పకుండా నాదే! ఇచ్చెయ్యి' అని బ్రతిమాలాను.

అతను ససేమిరా వీలుకాదని కవరు తీసుకెళ్ళిపోయాడు.

'ఇప్పుడేం చేయాలి?' అని పెద్ద సందిగ్ధంలో పడిపోయాను.

మెరుపులా మా కజిన్ బ్రదర్ మనసులో మెదిలాడు. వెంటనే టెలిగ్రాం యిచ్చాను— 'నేను సెలెక్ట్ అయానా?' అని.

ఆ మర్నాడే 'స్టార్ట్ యిమ్మీడియట్లీ ఆన్ లీవ్' అని తిరుగు టెలిగ్రాం వచ్చింది. హడావుడిగా మూడు రోజులు క్యాజువల్ లీవు పెట్టి సికింద్రాబాద్ రైలెక్కాను.

కాని నా ఆశ నిరాశే అయింది.

నేను వెళ్ళేటప్పటికి డివిజన్ ఆఫీసులో ఖాళీలన్నీ భర్తీ చేశారు. ముందొచ్చిన వాళ్ళని అక్కడ వేశారంట. లేటుగా వచ్చిన వాళ్ళని దూర ప్రాంతాలకి వేశారు

నన్ను సికింద్రాబాద్ - ద్రోణాచలం మధ్య 'కౌకుంట్ల' అనే చిన్న స్టేషన్లో లోకో సి. ఎస్. సి. ఆఫీసులో క్లర్కుగా వేశారు. నా ఉత్సాహమంతా నీరుగారి పోయింది!

కాని చేసేదేముంది! స్టేట్ గవర్నమెంట్ ఉద్యోగం కన్నా రైల్వే ఉద్యోగం మంచిది కదా! ఇటు రిజిగ్నేషన్ లెటరు పంపి అటు కౌకుంట్లకు ప్రయాణమయ్యాను.


తీరా అక్కడికి వెళ్ళాక, మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టుగా, ఆ ఉద్యోగం ఎంత నిస్తేజమైందో, నిరుత్సాహపూరితమైందో తెలిసింది!

కౌకుంట్ల వాటరింగ్ స్టేషను. సి. యస్. సి. అనబడే వ్యక్తి సీనియర్ క్లర్కట. అతని కెప్పుడూ డే డ్యూటీ— యస్. ఎమ్. లాగ. నా పోస్టు కెప్పుడూ నైట్ డ్యూటీనట— ఎ. యస్. యమ్. లాగ. నేను రిలీవ్ చేస్తున్న వ్యక్తి మూడేళ్ళ నుంచి అక్కడ నైట్ డ్యూటీ చేస్తున్నాట్ట! బాప్‌రే! అనిపించింది

పోనీ ఆ నైట్‌డ్యూటీ అయినా ఏ స్టేషన్లోనో కాదు. ప్లాట్‌ఫాంకి చివర గోడలతో కట్టిన వాటర్ రిజర్వాయర్ కింద వుండే గదిలో! అదే సి. యన్. సి. ఆఫీసు! రాత్రంతా ఆ గదిలో ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ ఉండాల్సిందే!

స్టేషనుకీ, నేనుండే గదికీ పెద్దగా కేక వేస్తేగాని వినపడనంత దూరం. అక్కడ కరెంటు లేదు. రాత్రులు స్టేషనులో కనిపించే చమురు దీపాల తప్ప చుట్టూ గాడాంధకారం! నా ఆఫీసు గది వెనకాలే పెద్ద పంపుల బావి, చుట్టూ ముళ్ళతీగె కంచెతో చెట్లతో నిండిన దాని తాలూకు యార్డు, అక్కడి నుంచి వచ్చే కీచురాళ్ళ ధ్వని రాత్రులు ధైర్యస్థుడికి తప్ప సామాన్య మానవునికి గుండె పీచుపీచు మనే పరిసరాలు!

ఇక నా డ్యూటీ, డ్రైవర్లకి డ్యూటీలు వేయటం, డ్యూటీ దిగే డ్రైవరు నుంచి ఇంజన్ కండిషన్ గురించి రిపోర్ట్ తీసుకొని డ్యూటీకి ఎక్కే డ్రైవరుకి యివ్వటం, అక్కడ ఆగే ప్రతి ట్రెయిన్ ఇంజనులో



**వెలకు రు. 1000 సంపాదించండి**

ఫొటోగ్రఫీ టీచరు రు. 10, ఎలెక్ట్రిక్ గైడు రు 10, టైలరింగు & కట్టింగు రు. 10, మెడికల్ సైన్సు గైడు 88 బొమ్మలతో రు. 10, వివాహపు జీవితము 100 బొమ్మలతో రు.10, 300 కుటీర పరిశ్రమ గైడు రు. 20, రేడియో గైడు రు. 10, రతిశాస్త్ర రు. 10, పోస్టేజి రు. 1.50 అదనపు.

**International Book Co., (AS)**
ALIGARH-25.



**దీర్ఘవ్యాధులకు ఉత్తమవైద్యం**

దురభ్యాసములకు లోనై, దాంపత్యసౌఖ్యంపొందలేనివార్కి హెర్నియా, చర్మవ్యాధులకు పోష్టుద్వారా వరిబీజం(బుడ్డ) ఇస్నోఫిలియా ఉబ్బసం (దమ్ము) జీర్ణాశయ(గ్యాస్ట్రిక్)మూత్ర,స్త్రీల వ్యాధులకు ఆపరేషన్ లేకుండా చికిత్స చేయబడును. రండి

**డా॥ దేవర**

3/1 బ్రాడీపేట, గుంటూరు. (A.P.)







# రిజిష్టర్డ్ పోస్ట్

బొగ్గు నిల్వ తనిఖీచేసి అవసరమైనంత బొగ్గు లోడ్ చేయించటం మొదలైనవి.

వీటన్నిటికన్నా ఇబ్బందికరమైనవిషయం – రైల్వేక్వార్టర్సు తప్పించి ఆ స్టేషన్ దగ్గర ఊరేదీ లేకపోవటం! ఆ పేరు గల ఊరు అక్కడికి కొద్ది కిలోమీటర్ల దూరంలో వుంది. అదో కుగ్రామం, పోస్ట్ కార్డు కావాలన్నా పోలోమంటూ అంతదూరం పోయిరావాల్సిందే!

గుడ్సులో మెల్లగా ఆ స్టేషన్లో డ్రైవర్సుకి 'రన్నింగ్ రూం'వుంది నా భోజనం అక్కడే.

వెళ్ళినప్పటి నుంచి ఒకటే ఆలోచన, దిగులు.

'ఇదేం ఉద్యోగం! 'పక్షిరాజా' వారి ప్రభుత్వంలో లాగ పగలున్నిద, రాత్రిపని – అదీ సంవత్సరాల తరబడి!'

పోనీ పగలేదైనా కాలక్షేపం వుంటుందా అంటే అందుకు ఆస్కారమే లేదు.

ఆ ఉద్యోగంమీద విరక్తి భావం కలిగింది, జీతం తక్కువైనా పాత ఉద్యోగమే మేలని పించింది. ఏమీ పాలుపోని స్థితిలో రెండు రాత్రులు గడిపాను, మూడోరాత్రి ఒక నిర్ణయానికొచ్చాను అక్కడి నుంచి వచ్చేయాలని.

తెల్లవారాక పి యస్. పి. తో చెప్పాను నా నిర్ణయం గురించి. ఆతనూ యీ ప్రాంతం వాడేనట. కొంత ఆ అభిమానంతో నన్ను తొందరపడవద్దని చాలా దూరం నచ్చచెప్ప టానికి ప్రయత్నించాడు. కాని నా మనసు మారలేదు. నా పట్టుదల చూసి ఓ ఉపాయం చెప్పాడు.

ఆ రోజు శుక్రవారం. ఆ రోజు మహబూబ్ నగర్ వెళ్ళి రైల్వే హాస్పిటల్లో సిక్ చేస్తే, మరల హాస్పిటల్ కి వెళ్ళవలసింది ఆల్టర్నేట్ డేస్‌లో గనుక, ఆల్టర్నేట్‌డే ఆదివారం అయింది గనుక, సోమవారం వెళ్ళొచ్చు. ఈలోగా యిక్కడికొచ్చి నా పోస్ట్‌లో ఎవరి నైనా వేస్తే తిరిగి సోమవారం నాటికి మహబూబ్‌నగర్ చేరటం, పోస్ట్ ఖాళీగా వుంటే యిక్కడ జేరిపోవటం.

మహబూబ్ నగర్ కి రైల్వేపాస్ రాసిచ్చాడు. అక్కడికివెళ్ళి సిక్ చేసి, ఏ అర్ధ రాత్రికో వచ్చే ట్రెయిను కోసం పడిగాపులు పడి తెల్లవారేసరికి సికింద్రాబాద్‌చేరుకున్నాను.

ఉదయాన్నే ఇంటి ముందు పళ్ళుతోము కుంటున్న మా కజిన్ బ్రదర్ నన్ను చూసి విస్మయంగా 'ఏంటా?' అని పలకరించాడు.

ఇంట్లోకి వెళ్ళాక నా నిర్ణయం గురించి చెప్పాను.

ఇక్కడా మొదలయ్యాయి హితబోధలు.

రైల్వేఉద్యోగం రావటం ఎంత కష్టమో – అదృష్టమో, వచ్చినదాన్ని పోగొట్టుకోటం ఎంత అవివేకమో, అపూటంతా నానావిధాలుగా నచ్చజెప్ప జూశాడు. కొందరు స్నేహితులతో కూడ చెప్పించాడు చివరి ప్రయత్నంగా, నేను చేరిన ఉద్యోగంలోనే చేరి యిప్పుడు నైట్ డూటీల బారినుంచి బయటపడ్డ మరో స్నేహితుడి చేతకూడ నేను చేసేపని మంచిది కాదని, ఓర్పు వహించమని చెప్పించాడు. కొంతకాలం ఓర్చుకుంటే మరో మంచి ప్రాంతానికి ట్రాన్స్‌ఫర్‌కి ట్రై చేద్దామని చెప్పి ఎలాగైతేనేం నా ప్రయత్నం నుంచి విరమించటానికి ఒప్పించాడు.

అదే సాయంత్రం నన్ను కొకుంటకి పంపటానికి సికింద్రాబాద్ స్టేషనుకి తీసు కెళ్ళాడు. అక్కడ మా కజిన్ స్నేహితులు మరికొందరు కనిపించారు. ట్రెయిను స్టార్ట్ కావటానికి యింకా టైం వుంది మాటల మధ్య నా విషయం తెలుసుకొని వాళ్ళొక సూచన చేశారు

'ఇతనెలాగూ సిక్‌లో వున్నాడు కదా. హాస్పిటల్లో కనిపించవలసింది ఎల్లుండి సోమవారం. రేపు ఆదివారం గాబట్టి అక్కడి కెళ్ళి చేసేదేం వుండదు. ఇక్కడే వుండి సినిమాలవీ చూపించు కొంత రిఫ్రెష్ అవుతాడు' అన్నారు

వాళ్ళ సూచన బాగానే వుందని తిరిగి నన్ను యింటికి తీసుకువెళ్ళాడు.

అప్పటికే వాతావరణం బాగాలేదు వర్షం వచ్చే విధంగా వుంది.

ఆ రాత్రంతా విడతెరిపి లేకుండా కుంభ వృష్టి!

తెల్లవారుతూనే అశనిపాతం లాంటి దుర్వార్త!

క్రితం రోజు సాయంత్రం నేను ఎక్క బోయిన ట్రెయినుకి మహబూబ్‌నగర్ ఇవతల వంతెనమీద ఘోరమైన ప్రమాదం! నూట యాభైమందికి పైగా దుర్మరణం!

గుండె ఝల్లుమంది!

నన్నంతా అదృష్టవంతుడన్నారు.

భగవంతుడు మా కజిన్ బదర్ స్నేహితుల రూపంలో వచ్చి నన్ను కాపాడడన్నారు.

బాగానే వుంది. కాని నేను మళ్ళీ ఆరోజు సాయంత్రమే మహబూబ్‌నగర్‌కి వెళితేగాని సోమవారం హాస్పిటల్లో రిపోర్టు చేయలేను. ఈ పరిస్థితుల్లో ప్రయాణం ఎలాగనేది సమస్య!

పగలు కాస్త తెరిపిచ్చినా ఆకాశం మేఘావృతంగానే వుంది. సాయంత్రానికి మరల వర్షపు జల్లులతోపాటు ఈదురుగాలి కూడ వీస్తోంది. ప్రయాణం తప్పనిసరై ఆ సాయంత్రం సికింద్రాబాద్ స్టేషనుకెళ్ళాము.

అక్కడ ఎంక్వయిరీ చేస్తే ఆ రోజు ట్రెయిను ప్రమాద స్థలానికి యివతలి స్టేషను వరకు వెళుతుందట. అలాగే అటు వైపు నుంచి వచ్చే ట్రెయిను అవతలి స్టేషను వరకు వస్తుందట కాబట్టి ఇవతలి వైపు స్టేషన్లో దిగి ఎలాగో అవతలి వైపు స్టేషనుకి చేరుకోవాలి.

ఇదంతా విని మా కజిన్ బ్రదర్ ఏదో దీర్ఘాలోచనలో పడ్డాడు.

'రెండు స్టేషన మధ్య భారీ వర్షాలవల్ల వరదలు పొంగి నదివల్ల రోడ్డు పరిస్థితి ఎలా వుందో! వాతావరణమూ బీభత్సంగా వుంది! వెళ్ళటానికి రాత్రివేళ ఏమైనా వాహనాలు దొరుకుతాయో లేదో. కొత్త ప్రదేశం. అక్కడ వాహనం దొరక్కపోతే ఎక్కడ తల దాచుకుంటాడు? మా చిన్నాన్న నామీద భరోసాతో వీణ్ణి యింత దూరం పంపిస్తే, అసలే ఇంటి మీద ధ్యాస మళ్ళిన వీణ్ణి యీ పరిస్థితుల్లో ముందుకుతోయటం భావ్యమా?' అని ఆలోచించాడులా వుంది— ఓ నిర్ణయానికి వచ్చిన వాడిలా గాఢంగా నిట్టూర్చి నాతో అన్నాడు—

'అరేయ్! నీ యిష్టప్రకారమే మనవూరికెళ్ళు, అక్కడ నీ పోస్ట్ ఫిలప్ కాకపోతే చేరిపో, ఫిలప్ అయితే వెంటనే వచ్చెయ్యి' అని చెప్పి ఆ దే ట్రైంలో మద్రాసుకు వచ్చే ట్రెయినులో ఎక్కించాడు.

ఒంగోలు కొచ్చేశాను.

మా ఆఫీసుకెళ్ళి కనుక్కుంటే పోస్టు యింకా ఖాళీగానే వుంది. వెంటనే గుంటూరులో వున్న డిస్ట్రిక్ట్ ఆఫీసుకెళ్ళి, అక్కడ వాళ్ళచేత వాళుగక్షింతలు వేయించుకొని, రీపోస్టింగ్ ఆర్డర్సు తీసుకొని మన డిపార్టుమెంట్లో పాతుకుపోయాను!

ఇదీ జరిగింది.

చూశారా? ఒక రిజిష్టర్ పోస్టు నా జీవిత గమనాన్ని ఎలా మార్చివేసిందో! లేకుంటే రైల్వే డిపార్టుమెంట్లో యీ పాటికి మంచి పొజిషన్లో వుండేవాణ్ణి!"

"ఆఁ, యిప్పుడు మాత్రం పోయిందేముందిలే! రాబడి తక్కువైనా ఆ వార కథాకారుడిగా మంచి పేరు తెచ్చుకున్నావ్! రైల్వేలో వుంటే అటువంటి ప్రదేశాల్లో నీ టాలెంట్ ప్రదర్శించుకొనే అవకాశం చిక్కేదో లేదో! అదంతా యిందుకే జరిగిందేమో!"

## వృద్ధులకు శిక్షణ

వృద్ధాప్యాన్నిచురుకుగా గడిపేందుకు పశ్చిమ జర్మనీలోని డార్ట్‌మండ్ విశ్వవిద్యాలయం వారు వృద్ధులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ కోర్సు రెండు సంవత్సరాలుంటుంది. ఈ కాలంలో వీరికి సోషియాలజీ, సోషల్ స్టడీస్, సైకాలజీ, డొమెస్టిక్ సైన్సులను బోధిస్తారు, గత సంవత్సరం యీ కోర్సులో ప్రవేశించిన 42 మందిలో సగానికిపైగా స్త్రీలేవున్నారు ఈ సంవత్సరం మరో 40 మందిని యీ కోర్సులో చేర్చుకున్నారు. ఈ కోర్సులను ప్రయోగాత్మకంగా 1984 మార్చి వరకు నిర్వహిస్తారు. ఈ శిక్షణ పూర్తయిన తర్వాత వీరు యువకుల కోసం నిర్వహింపబడుచున్న సంస్థలలో సలహాదారులుగా ఉంటారు.

ఆంజనేయులు కళాకారుల మీదున్న అభిమానం కొద్దీ అన్నాడు.

"కాని యీ రోజులలో డబ్బు-జీవితాల్ని ఎలా శాసిస్తోందో అందరికీ తెలిసిందే! కళారంగంలో దాని పాత్ర మరీనూ! ... నా జీవితంలో జరిగిన సంఘటనలకి 'నేను యిలా కావలసి వుంది' అనే కర్మసిద్ధాంతాన్ని ఆపాదిస్తే శ్రీధర్ కొట్టిపారవేయవచ్చు. కాని, నేనీమధ్య 'ప్రకృతి సహాయ నిరాకరణ' అనే 'సాడ్ సూత్రాన్ని' గురించి చదివాను. 'ఆర్క్‌రైట్ సాడ్' అనే ప్రముఖ ఇంజనీర్ యీ సూత్రాన్ని ప్రతిపాదించాడట. దీని ప్రకారం అరుదుగా జరిగే అవకాశం వున్న ఏదైనా సంఘటన ఆ సంఘటనకి ప్రాముఖ్యం వున్న సమయంలో నూటికి నూరుపాళ్ళూ జరుగుతుందట! అంటే మంచి రసకందాయంలో వున్నప్పుడు ఆటంకం జరిగితే 'అబ్బ! యిప్పుడే జరగాలా!' అనుకుంటామే- అలాగన్నమాట. నా జీవితంలో జరిగిన సంఘటనలకి కారణం కర్మసిద్ధాంతం కాదనుకున్నా 'సాడ్ సిద్ధాంతం' సరిగ్గా సరిపోతుంది!

ఈ సిద్ధాంతం ప్రకారం మానవుడికి అతీతమైన శక్తివల్లనే, అంటే ప్రకృతిలో వున్న ఏదో సహజగుణం వల్లనే అటువంటి సంఘటనలు జరుగుతాయట! వ్యాసం చివర ఆ వ్యాసకర్త ప్రశ్నిస్తాడు 'ఇలా ఎందుకు జరిగేను?' అని. నిజమే! రిజిస్టర్డ్ పోస్ట్‌లో నా యింటిపేరు తప్పుగా ఎందుకు వ్రాయబడాలి? ఆ చిన్న తప్పువల్ల గదా నా జీవితం యిన్ని మలుపులు తిరిగింది?"

"అది ఏ శక్తి ప్రేరేపించి కాదు! అది మనిషి చేసిన పొరపాటు!" ఠక్కున సమాధానం చెప్పాడు శ్రీధర్.

"ఆ పొరపాటే ఎందుకు జరగాలి? దానికి కారణం?"

ఈసారి శ్రీధర్ వెంటనే సమాధానం యివ్వలేదు.

'తీరా నేను మనసు మార్చుకొని కాకుంట్లకి తిరిగిపోవాలనుకున్న సమయంలోనే ఆ ట్రెయిను యాక్సిడెంట్ ఎందుకు జరగాలి? అలా జరగకపోతే నేను రైల్వే డిపార్ట్‌మెంట్‌లోనే వుండిపోయేవాణ్ణి కదా! ఒకవేళ నేను ఆ ట్రెయినులో ఎక్కివుంటే మృతుల జాబితాలో చేరి వుండేవాణ్ణేమో! స్టేషనుదాకా వెళ్ళి వాళ్ళెవరికల్లో నా ప్రయాణం ఎందుకు ఆగిపోవాలి? అంతేకాదు. నేను బి.ఏ.లో చేరబోయే సమయానికే ఆ సెలక్షన్ ఆర్డర్ ఎందుకు రావాలి? అది రాకపోతే యింకా చదువుకొని వుండేవాణ్ణి! ఇంకా మంచి ఉద్యోగం వచ్చి వుండేదేమో!

ఇవన్నీ యిలా జరగటానికి కారణం ఏమిటి? ఇవన్నీ సాడ్ సూత్రాన్ని నిరూపిస్తున్నాయా లేదా? మరి వాటి వెనుక వున్నది మానవాతీత శక్తి అవునా, కాదా?"

శ్రీధర్ మాట్లాడలేదు.

ఆ మౌనం అర్ధాంగీకారమో! అంగీకారమో?